@netifocusnews @focustv www.netifocusnews.com

TS-18-0006625

# నేటి ఫోకస్ న్యూస్

అను నిత్యం...ప్రజా పక్షం...

COMPLIMENTARY COPY

తెలుగు డిజిటల్ దినపత్రిక

ఎడిటర్: యం.తరుణ్ || తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం మా ఈ నేటి ఫోకస్ న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రిక || మంగళవారం 19, డిసెంబర్ 2023 || పేజీలు: 04

## ఒకే రోజు.. 78మంది ఎంపీల సస్పెన్షన్

### మొత్తం 92మంది విపక్ష సభ్యులపై వేటు

- పార్లమెంటులో భద్రతా వైఫల్యంపై హోం మంత్రి ప్రకటన కోరడమే కారణం
- గందరగోళం మధ్యనే పలు బిల్లుల ప్రవేశం



నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్/న్యూఢిల్లీ-డిసెంబరు 18:

పార్లమెంట్‌లో భద్రతా వైఫల్యంపై కేంద్ర హోంమంత్రి ప్రకటన చేయాలని డిమాండ్ చేసినందుకు పార్లమెంట్ ఉభయ సభల్లో 78 మంది ఎంపీలపై సోమవారం సస్పెన్షన్ వేటు పడింది. లోక్‌సభలో 30 మంది సభ్యులను ఈ సెషన్‌లో మిగిలిన రోజులకు.. ముగ్గురిని సభా హక్కుల కమిటీ ఇవేదిక సమర్పించేంతవరకూ సస్పెండ్ చేశారు. రాజ్యసభలో 35 మందిని సెషన్‌లో మిగిలిన రోజులకు.. 11 మందిని సభా హక్కుల కమిటీ నివేదిక సమర్పించేంతవరకూ సస్పెండ్ చేశారు. ఇదే అంశంపై గత వారం సస్పెండైన 14 మందితో కలిపి.. ఈ సెషన్‌లో మొత్తం 92 మంది ప్రతిపక్ష సభ్యులను మిగతా 2లో..

## తస్మాత్ జాగ్రత్త..



### మళ్లీ కలవరపెడుతున్న కోవిడ్ కొత్త వేరియంట్

- కొత్త వేరియంట్‌తో ఐదుగురు మృతి
- కేరళలో 4 మరణాలు.. యూపీలో ఒకటి నమోదు
- తస్మాత్ జాగ్రత్త.. రాష్ట్రాలకు కేంద్రం హెచ్చరికలు
- కేరళ, కర్ణాటక, తమిళనాడుల్లో కేసులు పైపైకి!

నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్/న్యూఢిల్లీ-డిసెంబరు 18:

దేశంలో కొవిడ్-19 కేసుల్లో స్వల్ప పెరుగుదల, కేరళలో జేఎన్.1 వేరియంట్ వెలుగుచూసిన నేపథ్యంలో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఈ నెల 8న కేరళ రాష్ట్రంలో 79 ఏళ్ల ఓ వృద్ధురాలిలో కొవిడ్-19 కొత్త వేరియంట్ జేఎన్.1 బయటపడ్డ విషయం తెలిసిందే. దానికి తోడు.. ఆదివారం దేశంలో 260 కొత్త కేసులు నమోదవ్వగా.. యాక్టివ్ కేసుల సంఖ్య 1,828కి పెరిగింది. ఒక్కరోజులో కేరళలో నాలుగు, ఉత్తరప్రదేశ్‌లో ఒకటి చొప్పున కరోనా మరణాలు సంభవించాయి. దీంతో.. రాష్ట్రాలు అప్రమత్తంగా ఉండాలంటూ కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ కార్యదర్శి సుదర్శన్ పంత్ రాష్ట్రాలకు లేఖలు రాశారు. "చలికాలం నేపథ్యంలో కరోనా వైరస్ మనుగడ సాధించగలుగుతోంది. వృద్ధులు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవాళ్లు అప్రమత్తంగా ఉండాలి" అని రాష్ట్రాలకు పంపిన లేఖల్లో సుదర్శన్ పంత్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు ఇన్‌ఫ్లుయెంజా మాదిరి అస్వస్థత(ఐఎల్ఐ), తీవ్ర శ్వాసకోశ ఇబ్బందులు(ఎసఏఆర్ఐ) కేసుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సరిపడా ఆర్టీపీసీఆర్ పరీక్షల కిట్లను సమకూర్చుకోవాలని సూచించారు. ఆర్టీపీసీఆర్, జీనోమ్ సీక్వెన్సింగ్ పరీక్షల ఫలితాలను ఎప్పటికప్పుడు కేంద్రానికి పంపాలని ఆదేశించారు. మరోవైపు పొరుగు రాష్ట్రం కేరళలో కొవిడ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో కర్ణాటక ప్రభుత్వం అప్రమత్తమైంది. "60 ఏళ్ల పైబడ్డవారంతా తప్పనిసరిగా మాస్కులను ధరించాలి. ఇతర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు కూడా జాగ్రత్తలు తీసుకోవాలి" అని కర్ణాటక ఆరోగ్య శాఖ మంత్రి దినేశ్ గుండూరావు ఆదేశించారు. కేరళ సరిహద్దు ప్రాంతాలైన కొడగు, దక్షిణ కన్నడ, చామరాజనగర్ ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కేరళ ఆరోగ్య మంత్రి వీణ జార్జి కూడా జేఎన్.1 వేరియంట్‌పై స్పందించారు. ఈ వేరియంట్ ప్రమాదకారి అని చెప్పలేమని, గతంలోనే భారత్ నుంచి సింగపూర్ వెళ్లిన 15మందిలో ఇది బయటపడిందన్నారు.

## ఒకే కుటుంబంలో ఆరుగురి హత్య!

- ఆస్తి కోసం దారుణానికి ఒడిగట్టిన ప్రాణ స్నేహితుడు
- పథకం ప్రకారం 15 రోజుల్లో దారుణాలు
- నేరం బయటపడకుండా ఒక్కోచోట ఒక్కొక్కరి హత్య
- నిందితుడికి అతడి సోదరుడు సహా ముగ్గురి సహకారం
- మృతులు.. ఇంటిపెద్ద, భార్య, కవలలు, ఇద్దరు చెల్లెళ్లు
- ఆచూకీ లేని ఇంటిపెద్ద తల్లి.. ఆమెనూ చంపేశాడా?
- నిజామాబాద్ జిల్లాలో ఘోరం.. అదుపులో నలుగురు

నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-డిసెంబరు 18:

ప్రాణ స్నేహితుడే దారుణానికి ఒడిగట్టాడు. స్నేహితుడిని, ఆయన భార్యను, వారి కవల పిల్లలను, స్నేహితుడి ఇద్దరు చెల్లెళ్లను.. మొత్తంగా ఆరుగురిని దారుణంగా హత్య చేశాడు. తొలుత స్నేహితుడిని నమ్మించి బయటకు తీసుకెళ్లి చంపిన ఆ దుండగుడు.. మాయమాటలతో ఒక్కొక్కరిని బయటకు తీసుకెళ్లి 15 రోజుల్లో మొత్తంగా కుటుంబాన్నే పొట్టనబెట్టుకున్నాడు. నిజామాబాద్ జిల్లాలో ఈ ఘోరం జరిగింది. ఒకరిని చంపి పూడ్చి పెడితే.. ముగ్గురి చంపి నీటి ప్రవాహంలో పడేశాడు. మరో ఇద్దరిని చంపి.. మృతదేహాలను దహనం చేశాడు! అప్పుగా తీసుకున్న రూ.10 లక్షలు ఎగ్గొట్టాలని.. తాత్కాలికంగా అని చెప్పి రాయించుకున్న రెండు ఇళ్లను కొట్టేయాలనే దురుద్దేశంతోనే అతడు ఇంతటి దారుణానికి ఒడిగట్టాడు. మిగతా 2లో..







## హైదరాబాద్‌కు రాష్ట్రపతి ముర్ము

- స్వాగతం పలికిన గవర్నర్, సీఎం, మంత్రులు
- ఐదు రోజులు బస
- పలు కార్యక్రమాలకు హాజరు

నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-డిసెంబరు 18:

శీతాకాల విడిది కోసం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హైదరాబాద్ చేరుకున్నారు. సోమవారం సాయంత్రం ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్న ఆమెకు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, సీఎం రేవంత్‌రెడ్డి స్వాగతం పలికారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, దుద్దిళ్ల శ్రీధర్ మిగతా 2లో..

## నేడు ఢిల్లీకి సీఎం రేవంత్ రెడ్డి

నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్:



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం ఢిల్లీకి వెళ్లనున్నారు. ముఖ్యనేతలు ఖర్గే, సోనియా, రాహు ల్, ప్రియాంక గాంధీతో భేటీ కానున్నారు. ఈ సందర్భం గా మంత్రివర్గ విస్తరణ, ఎమ్మెల్సీల ఎంపిక సహా పార్లమెంటు ఎన్నికల్లో వ్యవహరించాల్సిన అంశాల పై చర్చించనున్నారు. సోనియాగాంధీని తెలంగాణ నుంచి పోటీ చేయాలని విజ్ఞప్తి చేస్తూ పీఏసీ చేసిన తీర్మానాన్ని అధిష్ఠానానికి అందించనున్నారు. అలాగే, కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులు, మిగతా 2లో..

## మేడిగడ్డ రిపేర్ల బాధ్యత ఎవరిది?

2

నిత్య నూతనంగా వెలువడుతూ..

నేటి ఫోకస్ న్యూస్

అను నిత్యం...ప్రజా పక్షం...

తెలుగు డిజిటల్ దినపత్రిక

సంచలన వార్తా కథనాలతో నిత్యం విశేష పాఠకాదరణ పొందుతున్న, నేటి ఫోకస్ న్యూస్ డిజిటల్ తెలుగు దిన పత్రికకు తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల వారిగా, నియోజకవర్గాల వారిగా, మండలాల వారిగా, మండలాల వారిగా బ్యూరోలు, స్టాఫ్ రిపోర్టర్లు, విలేకరులు కావలెలను.

ఆసక్తి ఉన్నవారు ఈ క్రింది నెంబర్‌కు సంప్రదించగలరు.

9848488596



## మిషన్ భగీరథ సిబ్బందితో కలిసి నేను సైతం అంటున్నా సర్పంచ్ భాగం శ్రీనివాసరావు

నేటి ఫోకస్ న్యూస్, డిసెంబర్ 18-బోనకల్లు ప్రతినిధి:

గోవిందాపురం ఏ రైల్వే గేటు వద్ద మిషన్ భగీరథ పైప్ లైన్ పగిలి పోవడం తో గత పది రోజులుగా నీటి సరఫరా నిలిచిపోవడంతో గ్రామ ప్రజలు ఇబ్బందులు గుర్తించి మిషన్ భగీరథ సిబ్బంది తో కలిసి నేను సైతం అంటూ సిబ్బంది తో కలిసి పని చేస్తున్నా గోవిందాపురం ఏ గ్రామ సర్పంచ్ బాగం శ్రీనువాసరావు సర్పంచ్ బాగం శ్రీనువాసరావు మాట్లాడుతూ గ్రామ ప్రజలు లకు మంచినీటి సౌకర్యం ఇబ్బంది ఉండవచ్చు కానీ మూడవ కొత్త రైల్వే లైన్ పడిన తర్వాత ఏమైనా ఇబ్బందులు వస్తే ఇబ్బందులు పడకూడదు అనే ముందు జాగ్రత్తగా పకడ్బందీగా పని చేయడం వల్ల భవిష్యత్తులో ఇబ్బందులు కలగకుండా ఉండాలని ఉద్దేశంతో రైల్వే గేటు వద్ద లేట్ అవుతుంది గ్రామ ప్రజలకు గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోవిందాపురం ఏ గ్రామ సర్పంచ్ బాగం శ్రీనువాసరావు మీనన్ భగీరథ సిబ్బంది గ్రామ పంచాయితీ సిబ్బంది దారా సురేష్ రాములు పాల్గొన్నారు.

## కాకతీయ జంతు ప్రదర్శనశాలలోనికి ప్రవేశించే మురుగు నీటి ప్రవాహాల దారి మళ్ళించాలి

- డిమాండ్ చేసిన వరంగల్ పౌర స్పందన వేదిక
- సానుకూలంగా స్పందించిన కమీషనర్..

హనుమకొండ (నేటి ఫోకస్ న్యూస్)డిసెంబర్ 18:

జిల్లా కేంద్రం లోని గ్రీవన్ సెల్ కార్యక్రమంలో వరంగల్ మహానగర పాలక స%శీ%స్థ కమీషనర్ షేక్ రిజ్వాన్ పాషను కలిసి కాకతీయ జంతు ప్రదర్శన శాల లోకి ప్రవేశిస్తున్న మురుగు నీటి ప్రవాహా జూ పార్కులోనికి రాకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ మెమోరాండం సమర్పించడం జరిగింది.స్పందించిన కమీషనర్ ఇప్పటికే జూపార్కు ముందు గల ప్రధాన రహదారి గుండా మురుగు నీరు పోవడానికి డ్రైన్ నిర్మాణ పనులు ప్రారంభమైనవీ అడ్వొకేట్స్ కాలనీల వైపు నుండి వస్తున్న మురుగు నీటి దారి మళ్ళింపు విషయంలో స్థానికుల వ్యతిరేకతపై మురుగు బాధిత కాలనీ వాసుల సమన్వయ పరిస్తే సమస్య పరిష్కారమవుతుందని తెలియ జేశారు.ఈ కార్య క్రమంలో పౌర స్పందన వేదిక మరియు ఠాకూర్ సింగ్ కాలనీ వాసులైన నల్లెల్ల రాజయ్య, అంబటి కుమార స్వామి, యం.సంపత్ రెడ్డి, రాజ శేఖర్,వెంకట్రాజం సయ్యద్ అసద్ ,రాజు దేవర ,రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 23న శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అప్పాపూర్ పర్యటన

- ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసు పేరును అంబేద్కర్ ప్రజా భవన్ పేరు
- ప్రతి సామాన్య ప్రజలను కూడా అందుబాటులో ఉంటా
- భారీ మెజార్టీ కట్టబెట్టిన ప్రజానీకానికి కృతజ్ఞతలు



అచ్చంపేట ( నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి)-ఆర్.భరత్ డిసెంబర్ 18

ఈనెల 23న గిరిజన, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క నల్లమల లోని లింగాల మండల పరిధిలో ఉన్న అప్పాపూర్ పెంట పర్యటనకు విచ్చేయుచున్నారని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ తెలిపారు.సోమవారం జిల్లాలోని అచ్చంపేట మండలం హాజీపూర్ చౌరస్తా వద్ద స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కార్యకర్తల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అచ్చంపేట చరిత్రలోనే కనీవినీ ఎరుగని విధంగా ఈ ప్రాంత ప్రజలు గత ప్రభుత్వ తీరును ఎండగడుతూ.. భారీ మెజార్టీని కట్టబెట్టినందుకు ప్రజానీకానికి, కార్యకర్తలకు, కృతజ్ఞతలు తెలుపుతూ ఇది ప్రజల విజయం అన్నారు.ప్రతిపక్ష పార్టీ నాయకులు కార్యకర్తలు ఇంకా అధికారం మాదే అన్నట్టుగా వ్యవహరిస్తున్నారని అక్కడక్కడ కొన్ని గ్రామాలలో అధికార పార్టీ కార్యకర్తలను ఉసిగొలిపేలా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని అయినప్పటికీ నాయకులు, కార్యకర్తలు సమయమును పాటించాలని సూచించారు.అప్పటికీ మితిమీరితే దానికి తగిన ఫలితాలు అప్పటి పరిస్థితులే తెలుస్తాయన్నారు.

**వారంలో ఒకరోజు ప్రజా దర్బార్ త్వరలో..**

సీఎం రేవంత్ రెడ్డి మహాత్మ జ్యోతిరావు పూలే ప్రజా భవన్గా మార్చి ప్రజా సమస్యలను పరిష్కరించే చర్యలు ఎలా తీసుకున్నారో%ౌా% అలాగే అచ్చంపేటలో కూడా త్వరలోనే వారంలో ఒకరోజు అంబేద్కర్ ప్రజా భవన్ లో ప్రజా దర్బార్ నిర్వహిస్తామని గుర్తు చేశారు.ప్రజా దర్బార్ నిర్వహించే రోజున పార్టీ నాయకులు కార్యకర్తలు ఎవరూ కూడా హాజరు కాకూడదని సామాన్యులు సైతం ప్రజాభవన్ కొచ్చి వారి సమస్యలు చెప్పుకునేలా వాతావరణం కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని హితవు పలికారు. ప్రజా సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వము లక్ష్యమని, గతంలో మాదిరిగా ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత కార్యకర్తల ఫోను ఎమ్మెల్యే ఎత్తడం లేదని ప్రచారం చేయకూడదని, ప్రభుత్వంలో ఉన్నాము కనుక అధికారులు ప్రజా సమస్యలు ఇతర అభివృద్ధి పనులపై దృష్టి సారించాల్సి ఉంటుంది కాబట్టి కొన్ని సందర్భాలలో నాయకుల, కార్యకర్తల ఫోను ఎత్తడం వీలు కాదని అంతమాత్రాన దానిని సాకుగా తీసుకొని తప్పుడు ప్రచారం చేయరాదన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు లాయర్ రాజేందర్, మాజీ ఎంపీపీ రామనాథం, కుంద మల్లికార్జున్, గోపాల్ రెడ్డి, రవీందర్ రెడ్డి, కాశన్న యాదవ్ శ్రీనివాసులు, దొడ్డు నరసయ్య యాదవ్, వెంకట్ రెడ్డి, రాజు, మహిళా కాంగ్రెస్ నాయకురాలు కే శ్రావణి, సుశీల తదితరులు ఉన్నారు.

# ఒకే రోజు.. 78మంది ఎంపీల సస్పెన్షన్

(మొదటి పేజీ తరువాయి..)

సస్పెండ్ చేసినట్లయింది. పార్లమెంట్ చరిత్రలో ఒక సెషన్‌లో ఇంతమందిని సస్పెండ్ చేయడం ఇదే మొదటిసారి. లోక్‌సభ నుంచి సస్పెండైన ఎంపీల్లో కాంగ్రెస్ సభాపక్ష నేత అధీర్ రంజన్ చౌధురి, డిప్యూటీ నేత గౌరవ్ గొగోయ్, తృణమూల్ ఎంపీలు కల్యాణ్ బెనర్జీ, కాకోలీ ఘోష్ దస్తీదార్, సౌగత్ రాయ్, శతాబ్ది రాయ్, డీఎంకేసభ్యులు ఎ.రాజా, దయానిధి మారన్ తదితరులున్నారు. రాజ్యసభలో కాంగ్రెస్ సభ్యులు జైరాం రమేశ్, రణ్‌దీప్ సింగ్ సూర్జేవాలా, డీఎంకే ఎంపీలు కనిమొళి, ఆర్జేడీ సభ్యుడు మనోజ్ కుమార్ ఝా తదితరులున్నారు. 1989లో రాజీవ్ గాంధీ హయాంలో 63 మందిని సస్పెండ్ చేశారు. అప్పట్లో.. వారంలో మిగిలిన మూడు రోజులకే సస్పెన్షన్ వర్తింపజేయగా, ఇప్పుడు సెషన్ నుంచే సస్పెండ్ చేశారు.

**నినాదాల హోరు..**

సోమవారం పార్లమెంట్ సమావేశం కాగానే ఉభయ సభలూ ప్రతిపక్ష సభ్యుల నినాదాలతో దద్దరిల్లాయి. "మోదీ సర్కార్ డౌన్‌డౌన్" అన్న నినాదాలతో లోక్‌సభ దద్దరిల్లింది. "టీవీల్లో కాదు సభకు వచ్చి మాట్లాడు" అని ప్రతిపక్ష సభ్యులు డిమాండ్ చేశారు. పార్లమెంటులో భద్రతా వైఫల్యం, మణిపూర్ పరిస్థితులపై చర్చకు ఉభయ సభల్లోనూ ప్రతిపక్షాలు ఇచ్చిన నోటీసులను సభాపతులు తిరస్కరించారు. లోక్‌సభ తొలుత 11 నుంచి 12 గంటలకు వాయిదాపడింది. గందరగోళం మధ్యనే కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ టెలీకమ్యూనికేషన్ బిల్లును ప్రవేశపెట్టారు. ఆ తర్వాత స్పీకర్ ఓం బిర్లా.. సభను మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేశారు. ఆ తర్వాత 2.45 వరకు వాయిదా వేసి 'పోస్టాఫీసు బిల్లు, 2023'ను ఆమోదించి వెంటనే 3 గంటలకు వాయిదా వేశారు. ఆ తర్వాత కాంగ్రెస్ నేత అధీర్ రంజన్ చౌదురితో సహా 30 మంది ప్రతిపక్ష సభ్యులను సస్పెండ్ చేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. తీవ్ర గందరగోళం మధ్య ఆయన 3.20 గంటలకు సభను మంగళవారానికి వాయిదా వేశారు. రాజ్యసభ కూడా 11.30 గంటలకు, 2గంటలకు, 4గంటలకు, 4.30గంటలకు వాయిదా వేశారు. ఆ తర్వాత.. 35 మంది ప్రతిపక్ష సభ్యులను శీతాకాల సమావేశాలు పూర్తయ్యే వరకూ సస్పెండ్ చేస్తున్నట్లు చైర్మన్ జగదీప్ ధన్ ఖడ్ ప్రకటించారు. 11 మంది రాజ్యసభ సభ్యుల సస్పెన్షన్‌ను సభా హక్కుల కమిటీకి నివేదిస్తున్నట్లు తెలిపారు. సస్పెండైన ఎంపీలు సభను విడిచి వెళ్లాలని చైర్మన్ ఆదేశించారు. అయినా వారు పట్టించుకోకపోవడంతో సభను మంగళవారానికి వాయిదావేశారు.

**ప్రజాస్వామ్యంపై దాడి..**

డిసెంబరు 13న లోక్‌సభలోకి చొరబడ్డవారికి పాస్‌లు ఇచ్చిన బీజేపీ ఎంపీ ప్రతాప్ సింహాపై ఎలాంటి చర్యలూ తీసుకోకుండా.. హోం మంత్రి ప్రకటన కోరిన తమను సస్పెండ్ చేయడంపై విపక్ష సభ్యులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. "ఇక.. ప్రతిపక్షాలు లేని పార్లమెంట్‌లో మోదీ సర్కారు కీలక చట్టాలను ఎలాంటి చర్చా లేకుండా ఇష్టం వచ్చినట్లు ఆమోదించుకోవచ్చు. అసమ్మతిని తొక్కేయొచ్చు" అని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే నిప్పులు చెరిగారు. "తొలుత చొరబాటుదారులు పార్లమెంట్ పై దాడి చేశారు. తర్వాత మోదీ ప్రభుత్వం పార్లమెంట్ పై, ప్రజాస్వామ్యంపై దాడి చేసింది. ఎంపీలను సస్పెండ్ చేయడం ద్వారా మొత్తం ప్రజాస్వామిక సంప్రదాయాలను మోదీ ప్రభుత్వం తుంగలో తొక్కింది" అని ఆయన ధ్వజమెత్తారు. ఇక.. ప్రభుత్వ నియంతృత్వం పరాకాష్టకు చేరిందని, పార్లమెంట్‌ను బీజేపీ కేంద్ర కార్యాలయంగా భావిస్తోందని అధీర్ రంజన్ చౌదురి విమర్శించారు. దేశంలో ప్రజాస్వామ్యం హత్యకు గురైందని (మర్డర్ ఆఫ్ డెమొక్రసీ ఇన్ ఇండియా.. ఈ పదాల్లోని మొదటి అక్షరాలను కలిపితే 'మోదీ' అని వస్తుంది) జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు. లోక్‌సభ నుంచి 46 మందిని సస్పెండ్ చేయడం.. నిరసనను తొక్కిపెట్టేందుకు మోదీ, షాలు పన్నిన మాస్టర్ స్ట్రోక్‌గా తృణమూల్ కాంగ్రెస్ అభివర్ణించింది. కాగా, విపక్ష ఎంపీలను సస్పెండ్ చేయడం సరైందేనని బీజేపీ వ్యాఖ్యానించింది. సభను భగ్నం చేసింది ప్రతిపక్షాలేనని బీజేపీ నేత ప్రకాశ్ జావడేకర్ అన్నారు. ప్రతిపక్షాలు అసభ్యంగా ప్రవర్తించాయని.. మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎలాంటి ఎజెండా లేనందువల్లే వారు అభద్రతతో వ్యవహిస్తున్నారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. ప్రతిపక్షాలు ఉభయసభాపతులనూ తమ వైఖరితో తీవ్రంగా అవమానించాయని పీయూషగోయల్ వ్యాఖ్యానించారు.

## ఒకే కుటుంబంలో ఆరుగురి హత్య!

(మొదటి పేజీ తరువాయి..)

నిందితుడు నిజామాబాద్ జిల్లా మాక్లూర్‌కు చెందిన మెడిద ప్రశాంత్! అతడి చేతిలో హతమైంది మాక్లూర్ గ్రామానికే చెందిన పూనా ప్రసాద్ (36), ఆయన భార్య సాత్విక అలియాస్ రమణి (29), వారి కవలలైన అబ్బాయి చైతు (7), పాప చైత్రి (7). ప్రసాద్ చెల్లెళ్లు స్వప్న (24), స్రవంతి (22). ప్రసాద్ తల్లి సుశీల ఎక్కడా కనిపించకపోవడంతో ఆమెనూ ప్రశాంత్ చంపేసి ఉంటాడా? అన్న అనుమానాలు కలుగుతుతున్నాయి. పోలీసు వర్గాల సమాచారం ప్రకారం.. ప్రసాద్‌కు మాక్లూరులో 100 చదరపు గజాల చొప్పున రెండు ఇళ్లు ఉన్నాయి. ఆ ఊర్లోనే ఆయనకు రెండున్నరెకరాల సాగుభూమి ఉంది. ఆరేళ్ల క్రితం ప్రసాద్.. ఒక ఎకరం అమ్మేసి ఆ డబ్బుతో ఉపాధి కోసం దుబాయి వెళ్లాడు. ఏడాది క్రితమే మాక్లూర్ వచ్చాడు. ఏడు నెలల క్రితం తన కుటుంబంతో కలిసి కామారెడ్డి జిల్లా పాల్వంచకు మారాడు. ప్రసాద్ తల్లి సుశీల కూడా ఆయన వద్దే ఉంటోంది. ప్రసాద్‌కు మాక్లూర్‌కే చెందిన ప్రశాంత్ స్నేహితుడు. అతడు నిజామాబాద్ జిల్లా కేంద్రం శివార్లో ఉంటున్నాడు. గతంలో ప్రశాంత్ అడిగితే ప్రసాద్ రూ.10 లక్షలు అప్పుగా ఇచ్చాడు. మరోవైపు.. దుబాయి నుంచి వచ్చినప్పటి నుంచి ఏడాదిగా ఖాళీగానే ఉండటం, కుటుంబ పోషణ భారం కావడంతో ప్రసాద్ తెలిసినచోటల్లా లక్షల్లో అప్పు చేశాడు. తీర్చేందుకు నాలుగు నెలల క్రితం మిగతా ఎకరంన్నర పొలం కూడా అమ్మేశాడు. అయినా కొంత అప్పు మిగిలే ఉండటంతో మాక్లూర్‌లో ఉన్న రెండు ఇళ్లపై రుణం తీసుకొని బయట అప్పులు తీర్చాలని అనుకున్నాడు. ఇదే విషయాన్ని స్నేహితుడైన ప్రశాంత్‌కు చెప్పుకొని.. గతంలో తానిచ్చిన రూ.10లక్షలు ఇచ్చేయాలని ఒత్తిడి చేశాడు. దీనికి ప్రశాంత్... తాను బ్యాంకులో రుణం ఇప్పిస్తానని, ఆ డబ్బులతో అప్పులు తీర్చుకోవచ్చని.. ఆ తర్వాత తాను ఇవ్వాల్సిన రూ.10లక్షలను ఇచ్చేస్తానని ప్రసాద్‌ను నమ్మించాడు. కొన్నాళ్ల తర్వాత.. రెండు ఇళ్లను తన పేరిట రాస్తే, తెలిసిన వ్యక్తుల పరిచయాలతో బ్యాంకు రుణం త్వరగా వచ్చేలా చేస్తానని ప్రసాద్‌కు చెప్పాడు. చిన్నప్పటి నుంచి స్నేహం ఉండటంతో ప్రశాంత్ మాటలను ప్రసాద్ విశ్వసించాడు. తన పేరిట ఉన్న రెండు ఇళ్లను ప్రశాంత్ పేరిట రిజిస్ట్రేషన్ చేశాడు. అయితే నెలల తరబడి బ్యాంకుల చుట్టూ తిరిగినా.. రుణం రాకపోవడంతో రెండు ఇళ్లను తిరిగి తనపేరు మీద రిజిస్ట్రేషన్ చేయాలని, తానిచ్చిన రూ.10 లక్షలనూ తిరిగిచ్చేయాలని ప్రశాంత్‌ను ప్రసాద్ అడుగుతూ వస్తున్నాడు. ఈ విషయంలో ఇద్దరి మధ్య పలుమార్లు గొడవలు కూడా జరిగాయి. ప్రసాద్ నుంచి ఒత్తిడి పెరగడంతో ఆయనతో పాటు కుటుంబసభ్యులందరినీ హత్య చేయాలని.. అప్పుడిక ఇళ్లు తన సొంతం అవుతాయని, అప్పూ తీర్చనవసరం ఉండదని ప్రశాంత్ తలపోశాడు. తొలుత ప్రసాద్‌ను నవంబరు 28న పని ఉందంటూ ప్రశాంత్ వెంట బెట్టుకొని నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లికి తీసుకెళ్లాడు. అక్కడ జాతీయ రహదారి పక్కన దారుణంగా హత్య చేసి మృతదేహాన్ని పూడ్చిపెట్టాడు. ప్రసాద్ కనిపించకపోవడంతో ఆయనకు అప్పులిచ్చినోళ్లు మాక్లూర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీన్ని అవకాశంగా మలచుకున్న ప్రశాంత్.. ప్రసాద్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని, వెంటనే పోలీస్ స్టేషన్‌కు రావాలని ఆయన భార్య రమణికి చెప్పి నమ్మించాడు. ఆమెను వెంటబెట్టుకొని నిర్మల్ జిల్లా బాసరలోని గోదావరి నదివైపు తీసుకెళ్లాడు. అక్కడ ఆమెను చంపి.. గోదావరిలో పడేశాడు. తర్వాత ప్రసాద్‌తో పాటు రమణిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారని నమ్మించి ప్రసాద్ సోదరి స్వప్నను డిసెంబరు 5వ మెదక్ జిల్లా చేగుంటలోని వడియారం శివారుకు తీసుకెళ్లాడు. అక్కడ ఓ కల్వర్టు పక్కన ఆమెను హత్యచేసి.. మృతదేహాన్ని గుర్తుపట్టకుండా కాల్చేశాడు. మరోసోదరి స్రవంతిని కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం భూంపల్లిలో చంపి మృతదేహాన్ని గుర్తుపట్టకుండా దహనం చేశాడు. తర్వాత ప్రసాద్ సుశీలకు మాయమాటలు చెప్పి.. ఆమె వద్ద ఉన్న పిల్లలు చైతు, చైత్రిలను తీసుకెళ్లి హత్యచేశాడు. మృతదేహాలను మూటగట్టి నిజామాబాద్ జిల్లా మెండోరా మండలం శివారులోని గోదావరి నదిపై ఉన్న సోన్‌బ్రిడ్జి కింద వేర్వేరు చోట్ల పడేశాడు. 13న భూంపల్లి శివారులో కాలిపోయిన స్థితిలో గుర్తు తెలియని యువతి మృతదేహం లభించడం.. దీనిపై సెల్‌ఫోన్ సిగ్నళ్ల ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేయడంతో ప్రశాంత్‌ను నిందితుడిగా గుర్తించారు. అతడిని అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో ఆరు హత్యల ఘటన వెలుగుచూసింది. తొలి మూడు హత్యలను తానే చేశానని, మిగతా మూడు హత్యల్లో తన సోదరుడితో పాటు ముగ్గురి సహకారం తీసుకున్నానని చెప్పాడు. వారిని కూడా పోలీసులు కూడా అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. ప్రసాద్, రమణి మృతదేహాలు దొరక లేదు. మిగతా నాలుగు మృతదేహాలను పోలీసులు గుర్తించారు. అయితే ప్రసాద్ తల్లి సుశీల కనిపించకపోవడంతో ఆమెనూ ప్రశాంత్ చంపేసి ఉంటాడా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వరుస హత్యల ఘటనపై కామారెడ్డి పోలీసులు మంగళవారం మీడియా సమావేశంలో పూర్తి వివరాలు వెల్లడించే అవకాశం ఉంది.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

వేములపల్లి (నేటి ఫోకస్ న్యూస్) డిసెంబర్18:

మండల కేంద్రంలోని లక్ష్మీదేవి గూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు పెరపాక గోపాల్ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే బి.ఎల్.ఆర్ నిరుపేద కుటుంబానికి చెందిన పెరపాక గోపాల్ పెద్ద కర్మకు గ్రామ శాఖ అధ్యక్షుడు గంట కృష్ణ యాదవ్ స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఆర్థిక సహాయంగా 11 వేల రూపాయలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేనున్నానని బి.ఎల్.ఆర్ సేవా కార్యక్రమాలు చేయడం హర్షినియమన్నారు. పెరపాక గోపాల్ అందరితో కలిసి మెలిసి ఉండి ఆప్యాయంగా పలకరించేవాడని గుర్తు చేశారు. ఎల్లప్పుడూ గోపాల్ కుంటమానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సబ్బు లింగారెడ్డి, గంట నాగయ్య, సుంకరపల్లి చలపతిరావు, పెరపాక సతీష్ , మల్లెబోయిన పుల్లయ్య, దాసరి నాగయ్య, చింతకాయల యాదగిరి, కంకణాల సైదిరెడ్డి, వెంకట్ రెడ్డి, గంట నాగరాజు, గాదే లింగారెడ్డి, జానకి రెడ్డి, కర్ణాకర్ రెడ్డి, ముత్యాల వీరబాబు, పేరాల భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆశా వర్కర్ల డిమాండ్ పరిష్కరించకపోతే ఉద్యమం

అచ్చంపేట నియోజకవర్గం (నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి) ఆర్ భరత్ డిసెంబర్ 18

నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని తెలంగాణ గజిటెడ్ ఆఫీసర్ భవనంలో నియోజకవర్గం సమావేశం ఆశా వర్కర్ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ రజిత ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగినది. ఈ సమావేశానికి సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు ముఖ్యఅతిథిగా ముఖ్యఅతిథిగా పాల్గొని ఈ సందర్భంగా మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం పై ఆశా వర్కర్లు అనేక ఆశలతో ఉన్నారని వారి ఆశలను నెరవేర్చాలని కోరారు లేనియెడల వారి డిమాండ్ల కోసం రాబోయే రోజుల్లో ఎలాంటి ఉద్యమానికైనా ఎనకాడమని తెలియజేశారు.

## నేడు ఢిల్లీకి సీఎం రేవంత్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి..)

తదితర అంశాలపైనా కేంద్రంలోని ముఖ్యులను కలిసి వారితో చర్చించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. కాగా, మంగళవారం ఉదయం 9 గంటలకు ఢిల్లీ వెళ్లనున్న రేవంత్ రెడ్డి సాయంత్రానికి హైదరాబాద్ చేరుకోనున్నారు. కాగా కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ.. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ నుంచి పోటీ చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ నేతలు కోరుకుంటున్నారు. లోక్‌సభ ఎన్నికలు మార్చిలోనే వచ్చే అవకాశం ఉండడంతో.. ఇప్పటి నుంచే ఆ ఎన్నికలపై దృష్టి సారించారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన తల్లిగా.. ఈ రాష్ట్రం నుంచి పోటీ చేయాలని సోనియాగాంధీని కోరాలని నిర్ణయించారు. ఈ మేరకు టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సోమవారం ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదించింది. ఈ తీర్మానాన్ని సోనియాగాంధీతోపాటు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకూ పంపనుంది. టీపీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం సోనియాగాంధీని స్వయంగా కలిసి లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ నుంచి పోటీ చేయాల్సిందిగా కోరనున్నట్లు చెబుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 65 సీట్లతో బొటాబొటి మెజారిటీతోనే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన నేపథ్యంలో.. వచ్చే లోక్‌సభ ఎన్నికలను తమకు అనుకూలంగా మలచుకోవాలని యోచిస్తోంది. ఈ ఎన్నికల్లో మెజారిటీ ఎంపీ సీట్లను గెలుచుకుంటే ప్రజాభిప్రాయానికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం సుస్థిరత కూడా సాధిస్తుందని పార్టీ నాయకత్వం భావిస్తోంది. దీంతో అగ్రనేత సోనియాగాంధీని రాష్ట్రం నుంచి బరిలోకి దించితే లోక్‌సభ ఎన్నికలను ప్రభావితం చేయవచ్చన్న యోచనలో ఉంది. అసెంబ్లీ ఎన్నికల్లో సోనియా, రాహుల్ సహా అధిష్ఠానం మొత్తాన్ని ప్రచారంలో కాంగ్రెస్ కేంద్రీకరించిన విషయం తెలిసిందే. వీరి ప్రచారం పార్టీ విజయానికి దోహదపడటంతో లోక్‌సభ ఎన్నికల్లో ఏకంగా సోనియాగాంధీనే ఇక్కడి నుంచి పోటీకి దించి ప్రజల దృష్టిని మరోమారు ఆకర్షించాలని రాష్ట్ర నాయకత్వం భావిస్తోంది.

## హైదరాబాద్‌కు రాష్ట్రపతి ముర్ము

(మొదటి పేజీ తరువాయి..)

బాబు, చీఫ్ సెక్రటరీ శాంతికుమారి, డీజీపీ రవిగుప్తా, త్రివిధ దళాలకు చెందిన అధికారులతో పాటు పలువురు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి ఆమె నేరుగా బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంకు చేరుకున్నారు. రాష్ట్రపతి వాస్తవానికి హకీంపేట ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌కు రావాల్సి ఉండగా పశ్చిమ బెంగాల్‌లోని ఖరగ్‌పూర్ ఐఐటీ 69వ స్నాతకోత్సవానికి హాజరై తిరిగి నగరానికి రావడం ఆలస్యం కావడంతో బేగంపేట విమానాశ్రయంలో దిగారని తెలిసింది. రాష్ట్రపతి ఐదు రోజుల పాటు సికింద్రాబాద్‌లోని బొల్లారం రాష్ట్రపతి నిలయంలో బస చేయనున్నారు. మంగళవారం బేగంపేటలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్(హెచ్‌పీఎస) శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొంటారు. 20వ తేదీన నల్లగొండ జిల్లాలోని పోచంపల్లిలో చేనేత స్పిన్నింగ్ యూనిట్‌తో పాటు టెక్స్‌టైల్ మంత్రిత్వ శాఖ థీమ్ పెవిలియన్‌ను సందర్శిస్తారు. ఈ సందర్భంగా ఆమె చేనేత కార్మికులతో ప్రత్యేకంగా సమావేశమవుతారు. అదే రోజు సికింద్రాబాద్‌లోని ఎంఎన్‌ఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ స్వర్ణోత్సవ వేడుకలకు హాజరవుతారు. డిసెంబరు 21న రాష్ట్రపతి నిలయంలో వివిధ ప్రాజెక్టులను ప్రారంభిస్తారు. డిసెంబరు 22న రాష్ట్రంలోని విద్యావేత్తలు, ప్రముఖుల కోసం 'ఎట్ హోమ్' రిసెప్షన్‌ను నిర్వహిస్తారు. ప్రతి ఏడాది శీతాకాలం విడిదికి రాష్ట్రపతి ఇక్కడికి రావడం ఆనవాయితీ. ఇక్కడ బస చేసినన్ని రోజులు ఇక్కడి నుంచే అధికారిక వ్యవహారాలు నిర్వహిస్తారు. రాష్ట్రపతి రాక సందర్భంగా పోలీసులు నగర రోడ్లలో ట్రాఫిక్‌ను నియంత్రించారు. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిందని, సోమాజిగూడ నుంచి ప్రజాభవన్ చేరడానికి అర కిలోమీటర్‌కు అరగంట సమయం పట్టిందని ఓ వాహనదారుడు ఎక్స్‌లో ఫొటో షేర్ చేశారు.

# ఇది ప్రజా ప్రభుత్వం

- ప్రజలు ఆశించిన మేరకు నడుచుకుంటాం
- ఆరు గ్యారెంటీలను ఖచ్చితంగా అమలు చేస్తాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**నేటి ఫోకస్ న్యూస్, ఖమ్మం-డిసెంబర్18:**

ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన 6 గ్యారంటీలను ఖచ్చితంగా అమలు చేస్తామని రాష్ట్ర రెవిన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖామాత్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం నూతన కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో పాలేరు నియోజకవర్గ అభివృద్ధి పనులపై మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని, ప్రజలు ఆశించిన ఆశయాల మేరకు, వారి నమ్మకాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వమ్ము చేయమని అన్నారు. ప్రతి అంశంలో రాష్ట్ర వ్యాప్తంగా శ్వేత పత్రం విడుదల చేస్తామన్నారు. అధికారులు తమ తమ శాఖలకు సంబంధించి ఖచ్చితమైన లెక్కలు ఇవ్వాలన్నారు. సమీక్షలో పంచాయతీ రాజ్, మిషన్ భగీరథ, ఇర్రిగేషన్, రోడ్లు భవనాలు, డబల్ బెడ్ రూమ్, వైద్యం, రిజిస్ట్రేషన్, ఎక్సైజ్ శాఖల పనులపై సమీక్ష చేశారు. మిషన్ భగీరథ ద్వారా క్షేత్ర స్థాయిలో ఎంత మంది ప్రజలు, ఎన్ని గృహాలకు త్రాగునీటి సరఫరా చేస్తున్నది నివేదిక సమర్పించాలన్నారు. విద్యుత్ ఎన్ని గంటలు ఇస్తున్నది తెలుపాలన్నారు. జెఎన్టీయు ఇంజనీరింగ్ కళాశాలకు స్థల కేటాయింపు, ఫ్యాకల్టీ, పూర్తి స్థాయిలో కళాశాల నడిచేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. నేషనల్ హైవే ద్వారా చేపడుతున్న ప్రాజెక్టుల పురోగతి, సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. నర్సింగ్ కళాశాల భవన నిర్మాణ పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పాలేరు నియోజకవర్గ పరిధిలో పంచాయతీ రాజ్ కు సంబంధించి 2 సబ్ డివిజన్లు ఉన్నట్లు, 143 గ్రామ పంచాయతీలు ఉండగా, 95 గ్రామ పంచాయతీలకు స్వంత భవనాలు ఉండగా, 43 భవనాలు ఇజిఎస్ క్రింద మంజూరయి పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. మిగిలిన 5 గ్రామ పంచాయతీల భవనాల నిర్మాణానికి ఇజిఎస్ క్రింద ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. సీతారామ ప్రాజెక్టు క్రింద 2 ప్యాకేజీల పనులు జరుగుతున్నట్లు ఆయన తెలిపారు. అవసరం లేని చోట భూసేకరణలు చేసిన దగ్గర అవసరాలకు పనికివచ్చే భూములను చుట్టుపక్కల గ్రామాల నిరుపేదలకు పంపిణీకి చర్యలు తీసుకోవాలన్నారు. మున్నేరు వాగు నుండి లిఫ్ట్ లేకుండా, గ్రావిటీ తో సీతారామ ప్రాజెక్టుకు నీరు వెళుతుందా, ప్రణాళిక చేయాలన్నారు. పాలేరు లింక్ కెనాల్ కు సంబంధించి, భూసేకరణకు, రైతులతో మాట్లాడతానని, పనులు ప్రారంభం అయ్యేలా చర్యలు చేపట్టాలని అన్నారు. రోడ్లు, భవనాల శాఖ ద్వారా నియోజకవర్గ పరిధిలో 5 కాలనీల్లో 97 గృహ నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నట్లు, 2 కాలనీల్లో సంక్రాంతి లోగా పూర్తయే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇప్పటికి కేటాయించిన డబల్ బెడ్ రూం ఇండ్లు, గ్రామ సభ ద్వారా, లాటరీ ద్వారా, ఏ ప్రాతిపదికన కేటాయించింది నివేదిక సమర్పించాలన్నారు. తహశీల్దార్లు ఇప్పటికి జారీచేసిన పొజిషన్ సర్టిఫికెట్లు, పాస్ బుక్ లు పునః పరిశీలించి తప్పులు జరిగితే సరిదిద్దాలన్నారు. అన్యాక్రాంతం అయిన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకొని, రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఆర్డీవోలు ఇట్టి విషయాల్లో పర్యవేక్షణ చేయాలన్నారు. వైద్యానికి సంబంధించి పాలేరు నియోజకవర్గంలో ఎన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, ఎంతమంది సిబ్బంది ఉన్నది, ఎంత మంది ఖాళీలు ఉన్నవి నివేదిక ఇవ్వాలన్నారు. వైద్యాధికారులు క్షేత్ర స్థాయిలో విధులకు హాజరు అవుతున్నది, పనిచేయు స్థలంలో ఉంటున్నది నివేదిక ఇవ్వాలన్నారు. 7/24 వైద్యాధికారులు అందుబాటులో ఉండేలా, ప్రభుత్వ వైద్యశాలలపై ప్రజలకు నమ్మకం కల్గెలా చర్యలు తీసుకోవాలని అన్నారు. డయాలసిస్ రోగులు నియోజకవర్గంలో ఎంతమంది ఉన్నది తెలపాలని, వైద్య విషయంలో పాలేరు ను ఆదర్శంగా తీర్చిదిద్దేలా

చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం గ్రామాల్లో బెల్ట్ షాపులు లేకుండా చూడాలన్నారు. నియోజకవర్గ పరిధిలో నగరానికి చుట్టుపక్కల జరిగిన రిజిస్ట్రేషన్లను పరిశీలించాలని, నిబంధనల మేరకు పనులు జరగాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని తెలిపారు. ఉద్యోగుల ఫ్రెండ్లి ప్రభుత్వమని, ఇబ్బందులు, సమస్యలు పరిష్కరిస్తామని అన్నారు. ఉద్యోగులు ఫీడ్ బ్యాక్ ఇవ్వాలని, పాలసీలపై ఇన్ పుట్ ఇవ్వాలని, సమిష్టి గా పనిచేస్తేనే ప్రజలకు మేలు జరుగుతుందని అన్నారు. ఆర్థిక వ్యవస్థను అతికొద్ది రోజుల్లో గాడిలోకి తెస్తామని, వేతనాలు 1-5వ తేదీలోగా ఇచ్చేలా చర్యలు చేపడతామని అన్నారు. ప్రారంభమయి 50 శాతానికి పైగా పురోగతిలో ఉన్న పనులను పూర్తి చేయాలని, మంజూరయిన పనులు పునః సమీక్షించి, ప్రాధాన్యత ప్రకారంగా చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. కుటుంబ సభ్యులుగా కలిసి పనిచేస్తామని, ప్రభుత్వం మీద ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయమని, రెవిన్యూ, భూ, అనేక సెక్టార్లలో సంస్కరణలు తెస్తామని, అందరం కలిసి ప్రజలకు మంచి చేసినదే నిజమైన పరిపాలన అని మంత్రి తెలిపారు. ఈ సమీక్ష లో జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్, పోలీస్ కమీషనర్ విష్ణు ఎస్. వారియర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. సత్యప్రసాద్, జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్, అదనపు డిసిపి ప్రసాద రావు, జిల్లా అధికారులు, డివిజన్, పాలేరు నియోజకవర్గ మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మేడిగడ్డ రిపేర్ల బాధ్యత ఎవరిది?

- ఎల్ అండ్ టీ సంస్థ ప్రకటనతో బయటపడ్డ డొల్ల
- ఆనాడు ప్రభుత్వ పెద్దలు చేసిన ప్రకటనలకు బాధ్యులు ఎవరు?

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-డిసెంబర్18:**

మేడిగడ్డ రిపేర్ బాధ్యత తమది కాదని, తమ ఒప్పందం తీరిందని ఇటీవల ఎల్ అండ్ టీ సంస్థ చేసిన ప్రకటనతో ..కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బ్యారేజీపై గత బీఆర్ఎస్ ప్రభుత్వం చెప్పిందంతా అబద్ధమని తేలింది. ఎన్నికల ముందు దీనిపై తీవ్ర దుమారం రేగింది. అయితే అక్డ పగుళ్లేవీ లేవని కెటిఆర్ విమర్శలు గుప్పించారు. రాహుల, నేటి సిఎం రేవంత్ అక్కడకు వెళ్లడాన్ని ఎద్దేవా చేశారు. అలాగే కుంగిన మేడిగడ్డ బ్యారేజీ రిపేర్ల భారం నయా పైసా ప్రభుత్వంపై పడదని అప్పట్లో బీఆర్ఎస్ నేతలు, మంత్రులు ప్రకటించిందంతా బూటకమేనని స్పష్టమైంది. మేడిగడ్డ కుంగడంతో ఆ ప్రభావం ఎన్నికల్లో తమ పార్టీపై పడకుండా బ్యారేజీ నిర్మించిన ఎల్అండ్టీ సంస్థనే రిపేర్లు చేసి ఇస్తుందని ప్రజలను నమ్మించేందుకు బీఆర్ఎస్ ప్రయత్నం చేసిందని.. అధికారులు, ఇంజినీర్లతో నోటికి వచ్చినట్టు అబద్ధాలు చెప్పించిందని స్పష్టమైంది. బ్యారేజీలోని ఏడో బ్లాక్‌లో కుంగిన పిల్లర్ల రిపేర్లను నిర్మాణ సంస్థ ఎల్అండ్టీనే చేస్తుందని అప్పటి ప్రభుత్వ పెద్దలు చెప్పగా, రిపేర్లతో



తమకేమీ సంబంధం లేదని ఎల్అండ్ టీ కుండబద్దలు కొట్టింది. చేపట్టాల్సిన రిపేర్లకు డబ్బులు ఇవ్వాల్సిందేనని తేల్చి చెప్పింది. బీఆర్ఎస్ పెద్దలు చెప్పినట్టుగా డిఫెక్ట్ లయబిలిటీ పీరియడ్ ?ఐదేండ్లు కాదని రెండేండ్లేనని.. ఆ గడువు కూడా ఈ ఏడాది ఫిబ్రవరితోనే ముగిసిందనే నిజాన్ని ఎల్అండ్ టీ బయటపెట్టింది. బ్యారేజీ పునరుద్ధరణ పనులు చేయడానికి ఖర్చయ్యే మొత్తాన్ని ప్రభుత్వమే భరించాలని, ఇందుకోసం తమ సంస్థతో మళ్లీ అగ్రిమెంట్ చేసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. దీంతో మేడిగడ్డ రిపేర్ల భారం ప్రజలపైనే పడనుంది. ఎన్నికల్లో గెలుపు కోసమే అప్పటి కేసీఆర్ సర్కార్ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు నిజాలు దాచిందనే విషయాలు ఎల్అండ్ టీ లేఖతో బయటపడింది. ఈ ఏడాది అక్టోబర్ 21న మేడిగడ్డ బ్యారేజీ ఏడో బ్లాక్ లోని పిల్లర్లు కుంగాయి. దీని వెనుక ఏదైనా కుట్ర ఉండొచ్చని మొదట ప్రాజెక్టు ఇంజినీర్లు పోలీసులకు కంప్లయింట్ చేయగా, సాంకేతిక కారణాలతోనే బ్యారేజీ కుంగినట్టుగా తేలింది. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్ ?ఆధ్వర్యంలోని ఎక్స్‌పర్ట్ టీమ్ బ్యారేజీని పరిశీలించి డిజైన్ల లోపం, నిబంధనల మేరకు నిర్మాణం చేపట్టకపోవడంతోనే కుంగినట్టుగా ప్రాథమికంగా అంచనాకు వచ్చింది.అయితే ఎన్డీఎస్ఏ రిపోర్టును అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం కార్నర్ చేస్తూ కేంద్రానికి లేఖ రాసింది.ఈ క్రమంలోనే ఈ నెల రెండో తేదీన ఎల్అండ్ టీ సంస్థ రామగుండం ఈఎన్సీకి లేఖ రాసింది. మేడిగడ్డ బ్యారేజీ రిపేర్లతో తమకు సంబంధం లేదని అందులో స్పష్టం చేసింది. పలు ఆసక్తికర విషయాలను లేఖలో బయటపెట్టింది. 'మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణం 2018, ఆగస్టు 25 వరకు పూర్తి చేసేలా అగ్రిమెంట్ చేసుకున్నాం. వివిధ కారణాలతో 2020, జూన్ 29 నాటికి నిర్మాణం పూర్తి చేశాం. 2021, మార్చి 15వ తేదీతో బ్యారేజీ పనులు పూర్తయినట్టుగా సంబంధిత ఎస్ఈ మాకు ధ్రువీకరణ పత్రం ఇచ్చారు. అగ్రిమెంట్ ప్రకారం సివిల్ పనులకు ఏదైనా నష్టం జరిగితే బ్యారేజీ అప్పగించిన 24 నెలల వరకు మేం బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపింది. అక్టోబర్ 21న మేడిగడ్డ బ్యారేజీ కుంగగా 22న ప్రాజెక్టు ఇంజినీర్లతో పాటు ఎల్అండ్టీ సంస్థ ప్రతినిధులు కుంగిన బ్యారేజీని పరిశీలించారు. సమస్యకు కారణాలేమిటో పరిశీలిస్తామని, అవసరమైన పరిష్కారం చూపించే ప్రయత్నం చేస్తామని పేర్కొన్నారు. బ్యారేజీ.. నిర్మాణ సంస్థ ఎల్అండ్ టీ ఆధీనంలో ఉంది కాబట్టి పునరుద్ధరణ పనుల పూర్తి బాధ్యత ఆ సంస్థనే తీసుకుంటుందని మేడిగడ్డ ఈఈ తిరుపతిరావు వెల్లడించారు. ఈ క్రమంలో నవంబర్ 4న మేడిగడ్డ బ్యారేజీలోని ఏడో బ్లాక్ ను తామే పునరుద్ధరిస్తామని చెప్తూ ఎల్అండ్ టీ సంస్థ పేరుతో ఒక ప్రకటన మీడియాకు రిలీజ్ చేశారు. ఇప్పుడా ప్రకటన అసలు ఎల్అండ్ టీ సంస్థనే ఇచ్చిందా..లేక అప్పటి ప్రభుత్వమే ఎల్అండ్ టీ పేరుతో ప్రచారంలోకి తెచ్చిందా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

# తెలంగాణలో జూడాల సమ్మె పిలుపు

- నేటినుంచి సమ్మె చేస్తామని ప్రకటన
- మూడు నెలలుగా స్టైఫండ్ ఇవ్వడం లేదని ఆరోపణ

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-డిసెంబర్18:**

తెలంగాణలో జూనియర్ డాక్టర్లు సమ్మెకు పిలుపునిచ్చారు. గత 3 నెలలుగా స్టైఫండ్ ఇవ్వక పోవడంతో ఈ నెల 19 మంగళవారం నుంచి విధులకు హాజరు కాబోమని ప్రకటించారు. ఈ మేరకు నిరవధిక సమ్మెకు ఉపక్రమిస్తున్నట్లు వైద్య విద్య డైరెక్టర్ కు నోటీసులిచ్చారు. హౌస్ సర్జన్లు, జూనియర్ వైద్యులు, ఎస్ఆర్ లు ఇలా దాదాపు 10 వేల మంది వైద్య విద్యార్థులున్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఇంటర్న్ షిప్ చేస్తున్న హౌస్ సర్జన్లు సుమారు 2,500 మంది, దాదాపు 4 వేల మంది పీజీ స్పెషాలిటీ వైద్య విద్యార్థులు (జూనియర్ డాక్టర్లు), మరో 2 వేల మంది సీనియర్ రెసిడెంట్లు, 1,500 మంది వరకూ సూపర్ స్పెషాలిటీ వైద్య విద్యార్థులు ఉన్నారు. కాగా, హౌస్ సర్జన్లకు నెలకు రూ.26 వేలు, పీజీ స్పెషాలిటీ వారికి తొలి ఏడాది రూ.58 వేలు, రెండో ఏడాది రూ.61 వేలు, మూడో ఏడాది రూ.65 వేలు, సూపర్ స్పెషాలిటీ వైద్య విద్యార్థులకు రూ.92 వేల నుంచి రూ.లక్ష వరకూ ప్రభుత్వం స్టైఫండ్ రూపంలో చెల్లిస్తోంది. అయితే, గత 3 నెలలుగా స్టైఫండ్ బకాయిలు చెల్లించలేదని, దీని వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని జూనియర్ వైద్యులు తెలిపారు. ఈ క్రమంలో నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు జూడాల సంఘం డీఎంఈ రమేశ్ రెడ్డి ప్రకటించారు.'అన్ని రాష్ట్రాల కంటే తెలంగాణలోనే పీజీ వైద్య విద్యార్థులకిచ్చే స్టైఫండ్ తక్కువగా ఉంది. 3, 4 నెలలకోసారి స్టైఫండ్ విడుదల చేస్తే అప్పుల భారాన్ని మోయలేకపోతున్నాం. పీజీ చేస్తున్న వారిలో అత్యధికులకు పెళ్లిళ్లయ్యాయి. ఇళ్లు, వాహన రుణ వాయిదాలు కట్టలేని దుస్థితి నెలకొంది. ప్రభుత్వం నెలనెలా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని జూడాల అధ్యక్షుడు కౌశిక్ కుమార్ తెలిపారు. కాగా, జూడాల సమ్మె నేపథ్యంలో వైద్య సేవలకు అంతరాయం కలిగే అవకాశం ఉంది. ఈ క్రమంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై అధికారులు దృష్టి సారించారు. గాంధీ ఆస్పత్రిలో రోగులకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావు తెలిపారు. అయితే, ఇటీవల ఆదిలాబాద్ రిమ్స్ లోనూ జూనియర్ వైద్యులపై జరిగిన దాడికి నిరసనగా జూడాలు ఆందోళన చేపట్టారు. విధులు బహిష్కరించి, దాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 13న వైద్య విద్యార్థులపై కొందరు దుండగులు దాడికి పాల్పడ్డారు. రిమ్స్ లో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా విధులు నిర్వహిస్తున్న క్రాంతి కుమార్ కొందరి బయటి వ్యక్తులను తీసుకొచ్చి మెడికోలపై దాడికి పాల్పడగా పలువురికి గాయాలయ్యాయి. ఈ క్రమంలో జూడాలు ఆగ్రహం వ్యక్తం చేసి నిరసన తెలిపారు. దీంతో ఉద్రిక్తత నెలకొనగా, కలెక్టర్ ఓ కమిటీ ఏర్పాటు చేశారు. రిమ్స్ యాజమాన్యం దాడికి పాల్పడిన ప్రొఫెసర్ ను టర్మినేట్ చేయగా, పోలీసులు నిందితులను అరెస్ట్ చేశారు. అనంతరం కమిటీతో చర్చలు సఫలం కాగా ఈ నెల 16న జూడాలు సమ్మె విరమించారు.

# తెలుగు రాష్ట్రాలను వణికిస్తున్న చలి

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-డిసెంబర్ 18:**

తెలుగు రాష్ట్రాలను చలి వణికిస్తోంది. కనిష్ట స్థాయిలి ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. మరో నాలుగు రోజుల పాటు ఇలాంటి వాతావరణమే ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా తెలంగాణలో ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో పడిపోతున్నాయి. తెలంగాణలో చలితీవ్రత రోజురోజుకూ పెరుగుతున్నది. చలిగాలులు తీవ్రత పెరిగింది. ఆకాశం మేఘావృతమై మెల్లగా పొగమంచు ఆవరించింది. ఉత్తర తెలంగాణలో చలితీవ్రత క్రమంగా పెరుగుతోంది. తూర్పు, ఆగ్నేయం వైపు నుంచి తెలంగాణ వైపు గాలులు వీస్తున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాత్రివేళల్లోనే కాకుండా పగటి ఉష్ణోగ్రతలూ పడిపోతున్నాయని, రానున్న మూడు రోజుల్లో చలి తీవ్రత మరింత పెరగనున్నదని హెచ్చరించింది.గిరిజన ప్రాంతాలు చలికి అల్లాడిపోతున్నాయి. ఆదిలాబాద్, వరంగల్ కరీంనగర్ జిల్లాలను మంచు మేఘాలు కమ్మేస్తున్నాయి. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్‌లో అతి తక్కువ ఉష్ణోగ్రత నమోదు అయింది. అక్కడ 11 డిగ్రీల సెల్సియస్ నమోదు అయింది. ఆదివారం మాత్రం ఆదిలాబాద్ జిల్లా అతి తక్కువ ఉష్ణోగ్రత 13.1 డిగ్రీలు నమోదు అయింది. గరిష్ఠ ఉష్ణోగ్రత ఖమ్మం జిల్లాలో 30 డిగ్రీలుగా రిజిస్టర్ అయింది. మిగతా ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే... మూడు నాలుగు ప్రాంతాల్లో 15 డిగ్రీల లోపు ఉష్ణోగ్రతలు రిజిస్టర్ అయ్యాయి. గరిష్ఠ ఉష్ణోగ్రత కూడా ఒక్క ఖమ్మం మినహా అన్ని ప్రాంతాల్లో 25 నుంచి 28 మధ్యే ఉంది. రాష్ట్రంలో చాలా చోట్ల సాధారణం కంటే 2 డిగ్రీల మేర తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నట్టు వెల్లడించింది. పలు చోట్ల అత్యల్పంగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్‌లో 13.1 డిగ్రీలు, మెదక్‌లో 14.3, రంగారెడ్డిలో 15.7, హైదరాబాద్‌లో 16.2, కరీంనగర్, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో 17 చొప్పున, నల్లగొండలో 17.4, నిజామాబాద్ 18.1, మహబూబ్‌నగర్ 20.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

# మద్యంమత్తులో ర్యాష్ డ్రైవింగ్..


- ప్రమాదంలో పాదాచారి దుర్మరణం

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-డిసెంబర్18:**

చైతన్యపురిలో సోమవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మద్యం మత్తులో యువకుల కారు నడపడంతో జరిగిన ప్రమాదంలో ఒక పాదాచారుడు మృతి చెందాడు. అలాగే కారులో ప్రయాణిస్తున్న ఏడుగురు యువకులకు తీవ్రగాయాలయ్యాయి. యువకులంతా కలిసి ఓ బర్త్‌డే పార్టీకి వెళ్లి వస్తున్న క్రమంలో ప్రమాదం జరిగింది. నలుగురిని గాంధీ ఆసుపత్రికి.. మిగిలినవారిని ఓమ్ని హాస్పిటల్‌కు తరలించారు. ప్రమాదంలో కారు పూర్తిగా ధ్వంసమైంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా ప్రదేశానికి చేరుకుని ప్రమాద స్థలాన్ని సమీక్షించారు. కారు చౌటుప్పల్ ఎమ్మార్వో హరికృష్ణకు చెందినదిగా గుర్తించారు. ఆ కారును ఎమ్మార్వో కుమారుడు సాయి కార్తీక్ నడిపినట్టు తెలుసుకున్నారు. ఈ ఘటనపై చైతన్యపురి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# తెల్ల రేషన్ కార్డుల గుట్టు తేలేనా?

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-డిసెంబర్18:**



బీఆర్ఎస్ పాలనలో పౌరసరఫరాల విభాగాన్ని అల్లకల్లోలం చేశారని, ఆ శాఖ వద్ద 90లక్షల టన్నుల ధాన్యానికి లెక్కల్లేవని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. నిజానికి ఇదంతా ఎక్కడికి పోయిందన్న చర్చ సాగుతోంది. దీనిని మిల్లర్లు అమ్ముకున్నారా అన్న నిజం తేలాల్సి ఉంది. ఈ ధాన్యం ఉందా.. లేదా..మిల్లర్లు అమ్ముకున్నరా.. ఉంటే ఎక్కడుంది అనే గందరగోళం నెలకొంది. దీనిపై సమగ్ర పరిశీలన ప్రారంభించామని మంత్రి ప్రకటించారు. పదేండ్లలో ఈ శాఖ రూ. 56 వేల కోట్ల అప్పుల్లో ఉందని బాధ్యత చేపట్టిన మంత్రి ఉత్తమ్ తొలిరోజే ప్రకటించారు. ప్రస్తుతం రేషన్ కార్డుపై ఒక్కో వ్యక్తికి 6కిలోల బియ్యం ఇస్తుండగా.. ఇందులో కేంద్ర ప్రభుత్వ వాటా 5 కిలోలని, మిగతా కిలోబియ్యం రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్నది. ఇకపోతే రేషన్ బియ్యం చాలాచోట్ల లబ్ధిదారులకు చేరడం లేదన్నది వాస్తవం. అంతేగాకుండా ఆరోగ్యశ్రీలాంటి పథకాల కోసం చాలామంది గ్రామస్థాయిలో తెల్ల రేషన్ కార్డులు పొందారు కొత్తకార్డులు ఇచ్చే ముందు ఇలాంటి దొంగకార్డుల సంగతిని నిగ్గు తేల్చాల్సి ఉంది. బియ్యం ఎటు దారి మళ్లుతున్నాయో కూడా తేల్చాలి. ఇదంతా ఓ పెద్ద మాఫియాలాగా సాగుతోంది. దీనిని ఛేదించాలి. అప్పుడే ప్రజలకు న్యాయం జరగగలదు. ఆర్థికంగా ఆదా కాగలదు.



# మారనున్న కెసిఆర్ కిట్ పేరు

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-డిసెంబర్18:**

మాజీ సీఎం కేసీఆర్ పేరిట ఉన్న స్కీమ్‌ల పేర్లను మార్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నది. హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో కేసీఆర్ కిట్, కేసీఆర్ న్యూట్రిషనల్ కిట్ పేరిట రెండు స్కీమ్‌లు ఉన్నాయి. ప్రభుత్వ దవాఖాన్లలో డెలివరీ చేయించుకున్న మహిళలకు కేసీఆర్ కిట్ ఇస్తున్నారు. ఇదే స్కీమ్ కింద ఆడపిల్ల పుడితే రూ.13 వేలు, మగ పిల్లాడైతే రూ.12 వేలను దశలవారీగా తల్లి అకౌంట్‌లో వేస్తారు. రెండేండ్లుగా కిట్‌లు మాత్రమే ఇస్తున్నారు. డబ్బులు ఇవ్వడం ఆపేశారు. కేసీఆర్ న్యూట్రిషనల్ కిట్ స్కీమ్‌ను ఈ ఏడాదే ప్రారంభించారు. ఈ స్కీమ్ కింద గర్భిణులకు పోషకాహార పదార్థాలను అందజేస్తున్నారు. ఈ రెండు స్కీమ్‌లను ఇలాగే కొనసాగించే యోచనలో ఉన్న కాంగ్రెస్ సర్కార్, వాటి పేర్లను మాత్రం మార్చే ఆలోచన చేస్తున్నది. ఇప్పటికే ఈ అంశంపై ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా అధికారులతో చర్చించినట్టు సమాచారం. కొత్తగా ఏం పేర్లు పెట్టాలనే అంశంపై ఇంకా స్పష్టత రాలేదని వారు తెలిపారు.

# చెన్నకేశవనాథస్వామికి చెందిన 10 ఎకరాలు మాయం

- భూములను పట్టించుకోవడం లేదంటూ స్థానికుల ఆందోళన

**నేటి ఫోకస్ న్యూస్, జగిత్యాల-డిసెంబర్18:**

జగిత్యాల జిల్లాలో దేవుడి భూములను రక్షించడంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యింది. రాయికల్‌లోని శ్రీచెన్నకేశవనాథ ఆలయానికి చెందిన సుమారు 10 ఎకరాలు రికార్డుల్లో కనిపించడం లేదు. ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం ఈ భూముల విలువ సుమారు రూ.10 కోట్లకు పైగా ఉన్నట్లు సమాచారం. ఈ విషయమై కొంతకాలంగా రాయికల్ వాసులు ఆఫీసర్ల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. ఈ భూములకు సంబంధించి ఎన్ని ఫిర్యాదులు చేసినా గత ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అయినా భూముల జాడ కనుక్కోవాలని ప్రజలు కోరుతున్నారు. కాకతీయుల కాలంలో ఆలయ అభివృద్ధికి ధనంతో పాటు 10 ఎకరాల భూమి ఇచ్చినట్లు తెలుస్తోంది. శాసనాల ఆధారంగా దేవాలయానికి ఇచ్చిన 10 ఎకరాలు ఆచూకీ లభించడం లేదు. గతంలో రాయికల్ తహసీల్ ఆఫీస్‌ను నక్సల్స్ దహనం చేయడంతో వీటికి సంబంధించిన డాక్యుమెంట్స్ కాలిపోయినట్లు తెలుస్తోంది. రాయికల్ మున్సిపాలిటీగా ఏర్పడడంతో భూముల విలువ పెరిగింది. ఈ మేరకు ఇప్పటి విలువ ప్రకారం ఈ భూములకు రూ.10 కోట్ల పైగానే పలుకుతోంది. సర్వే నంబర్ల జాడ లేదని ఆఫీసర్లు తప్పించుకోవడానికి ప్రయత్నిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. భూముల కోసం ఎలాంటి ప్రయత్నాలు చేయకపోవడంపై ప్రజలు,స్థానిక బిజెపి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# వరంగల్ ఎంపీగా కొత్తవారికి ఛాన్స్

**నేటి ఫోకస్ న్యూస్, వరంగల్-డిసెంబర్18:**

రెండు సార్లు వరంగల్ ఎంపీగా నెగ్గిన పసునూరి దయాకర్ ను కాదని, ఈసారి బీఆర్ఎస్ అధిష్టానం కొత్తవాళ్లకు చాన్స్ ఇస్తుందని ప్రచారం జరుగుతోంది. వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ పేరు ఎక్కువగా వినిపిస్తోంది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన రమేశ్ లోక్‌సభ ఎన్నికల్లోనూ పోటీ చేయాలని చూస్తున్నారు. రిజర్వుడు సీటు కావడం ఆయనకు కలిసొచ్చే అంశం. పార్టీ జిల్లా అధ్యక్షునిగా రాజకీయ గురువు కడియం శ్రీహరితోపాటు మిగిలిన పార్టీ నేతలతో అరూరికి మంచి సంబంధాలు ఉన్నాయి. ఎంతో ఖర్చుతో కూడుకున్న ఎంపీ ఎన్నికలకు రమేశ్ రెడీగా ఉన్నట్లు సమాచారం. అయితే సిట్టింగ్ ఎంపీగా దయాకర్ మూడోసారి అవకాశం కోసం తనవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. కొత్తగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ టికెట్ కోసం ఎక్కువ మంది పోటీ పడుతున్నారు. మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్యతోపాటు గత ఎన్నికల్లో ఇక్కడి నుంచి పోటీ చేసిన దొమ్మాటి సాంబయ్య పేర్లు ఇప్పటివరకు ముందు వరుసలో ఉన్నాయి. అయితే పోలీస్ జాబ్‌ను వదులుకుని రాజకీయాల్లోకి వచ్చిన దొమ్మాటి సాంబయ్య కాంగ్రెస్ కష్టకాలంలో ఉన్నప్పటి నుంచి పనిచేస్తున్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున ఆయనే పోటీ చేశారు. మరోసారి అవకాశం ఇవ్వాలని గాడ్‌ఫాదర్లతో గట్టి ప్రయత్నాలే చేస్తున్నారు. మాస్ లీడర్‌గా సిరిసిల్ల రాజయ్యకు పార్టీ గుర్తింపు ఇచ్చినా.. అప్పట్లో వారి ఇంట్లో జరిగిన కోడలు, మనుమడు, మనుమరాలి ఆత్మహత్య ఇష్యూతో దూరం పెట్టింది. ప్రస్తుతం ఆయన పార్టీలో యాక్టివ్ అయ్యారు. ఎస్సీ నియోజకవర్గం వర్ధన్నపేట ఎమ్మెల్యే టిక్కెట్ ఆశించగా, కేఆర్. నాగరాజుకు ఇవ్వడంతో తప్పుకున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో పాత మిత్రులతో కలిసి ఎంపీ టికెట్ కోసం ముమ్మర ప్రయత్నం చేస్తున్నారు. వీరికితోడు నమిండ్ల శ్రీనివాస్, పెరుమాండ్ల రామకృష్ణ, మహిళా కోటాలో భారతి, ఇతర జిల్లాల నేతలు టికెట్?దక్కించుకోవాలని చూస్తున్నారు.

# మిస్టర్ బచ్చన్‌గా రవితేజ

మ్యాజికల్ కాంబో–మాస్ మహారాజా రవితేజ, హరీష్ శంకర్ కాంబినేషన్‌లో మూవీ అనౌన్స్‌మెంట్ వచ్చిందో.. లేదో, వరసగా అప్‌డేట్స్ వస్తూనే ఉన్నాయి. శనివారం హీరోయిన్‌ని పేరు, ఫస్ట్ లుక్ రివీల్ చేసిన మేకర్స్.. ఆదివారం సినిమాని పూజా కార్యక్రమాలతో ప్రారంభించేశారు. అంతేకాదు, ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్‌ని కూడా మేకర్స్ వదిలారు. మాస్ మహారాజా రవితేజ బిగ్ బి అమితాబ్ బచ్చన్‌కి వీరాభిమాని, హిందీలో అనర్గళంగా మాట్లాడగలరనే విషయం తెలిసిందే. తన కొన్ని సినిమాలలో బిగ్ బిని అనుకరిస్తూ అలరించారు కూడా. ఇప్పుడు హరీష్ శంకర్‌తో రవితేజ చేస్తున్న క్రేజీ ప్రాజెక్ట్‌కు 'మిస్టర్ బచ్చన్' అనే పవర్ ఫుల్ టైటిల్‌ను ఖరారు చేశారు. టైటిల్ పోస్టర్‌లో రవితేజ.. అమితాబ్ బచ్చన్ ఐకానిక్ పోజ్‌ను అనుకరిస్తున్నట్లుగా ప్రజెంట్ చేస్తోంది. ఈ లుక్‌లో రవితేజ పాత స్కూటర్‌పై షేడ్స్‌తో స్టైల్‌గా కూర్చుని కనిపిస్తున్నారు. అతని వెనుక నటరాజ్ థియేటర్, అమితాబ్ బచ్చన్ ఇమేజ్ చూడవచ్చు. అతను సినిమా లవరా సినిమాలో అమితాబ్ బచ్చన్‌కి వీరాభిమానా? 'బిగ్ బి–నామ్ తో సునా హోగా' అనే పాపులర్ డైలాగ్ ఈ సినిమా ట్యాగ్‌లైన్. టైటిల్ పోస్టర్ మాస్, అభిమానులు, అన్ని వర్గాల ప్రేక్షకులను ఖచ్చితంగా మెప్పిస్తుంది. ఈ మ్యాజికల్ మాస్ కాంబోలో రవితేజ సరసన భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తోంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి వివేక్ కూచిభొట్ల సహ నిర్మాత. పనోరమా స్టూడియోస్, టి–సిరీస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని ప్రజెంట్ చేస్తున్నాయి. ఆదివారం పలువురు అతిథుల సమక్షంలో ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా ప్రారంభించారు. హీరో రవితేజ, నిర్మాత టీజీ విశ్వ ప్రసాద్, వివేక్ కూచిభొట్ల, రఘు రామకృష్ణ స్క్రిప్ట్‌ను దర్శకుడు హరీష్ శంకర్‌కి అందజేశారు.








# అడవి శేషు, శృతిల మూవీ పేరు డెకాయిట్


టాలీవుడ్ యంగ్ హీరో అడివిశేష్ కాంపౌండ్ నుంచి ప్రస్తుతం గూఢచారి 2 రాబోతున్న విషయం తెలిసిందే. కొంతకాలంగా సందేశాత్మక కథాంశాలతో సినిమాలు చేస్తున్న అడివిశేష్ తాజాగా లవ్ స్టోరీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడని తెలిసిందే. శృతిహాసన్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ చిత్రానికి ఇంట్రెస్టింగ్ టైటిల్‌న్గ ÷నైల్ చేశారన్న వార్త ఒకటి ఇండస్ట్రీ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది. లేటెస్ట్ అప్‌డేట్ ప్రకారం ఈ మూవీకి డెకాయిట్ (ఆజీఇనీతిబి) టైటిల్‌ను ఫిక్స్ చేశారని వార్తలు వస్తుండగా.. మేకర్స్ నుంచి త్వరలోనే అధికారిక ప్రకటన రాబోతుందని ఇన్‌సైడ్ టాక్. యాక్షన్ డ్రామా నేపథ్యంలో ఉండబోతున్న ఈ చిత్రంలో శృతిహాసన్ ఓ పాట కూడా పాటబోతుందట. ఈ భామ మంచి సింగర్ అని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. హిందీ, తెలుగు భాషల్లో తెరకెక్కుతున్న ఈ సినిమా నుంచి ఇప్పటికే శృతిహాసన్ ఫస్ట్‌గ్లింప్స్‌ను విడుదల చేశారు. ముఖంపై స్కార్ఫ్ చుట్టుకొని తీక్షణ చూపులతో సీరియస్‌గా కనిపిస్తున్నది శృతిహాసన్. డెకాయిట్గ ÷నైల్ అయితే ఈ ఇంట్రెస్టింగ్ టైటిల్ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతుందనడంలో ఎలాంటి సందేహం లేదంటున్నారు సినీ జనాలు. తొలిసారి శృతిహాసన్, అడివిశేష్ కాంబోలో సినిమా వస్తుండటంతో అంచనాలు అమాంతం పెరిగిపోతున్నాయి. షనీల్ డియో డెబ్యూ (డైరెక్టర్) ఈ చిత్రానికి కథనందిస్తూ దర్శకత్వం వహించనున్నాడు. శృతిహాసన్ రీసెంట్‌గా హాయ్‌నాన్నలో ఓడియమ్మా పార్టీ సాంగ్‌లో మెరిసి స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచింది. ఈ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తుండగా.. ఆసియన్ సునీల్ సహనిర్మాతగా వ్యవహరిస్తున్నారు. శశి కిరణ్ టిక్కా దర్శకత్వంలో వచ్చిన 'గూఢచారి' చిత్రానికి సీక్వెల్‌గా వస్తున్న 'జీ2' (ఉ2) చిత్రానికి వినయ్ కుమార్ దర్శకత్వం వహిస్తు?న్నాడు. ఇప్పటికే అడివి శేష్.. 'జీ2' (ఉ2) నుంచి ప్రీ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేయగా.. నెట్టింట హల్ చల్ చేస్తోంది. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ బ్యానర్‌లపై టీజీ విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

# 'కీ డీవోర్స్ స్టాటిస్టిక్స్' పేరుతో ఇమేజ్ షేర్ చేసిన సామ్..

టాలీవుడ్ అగ్ర నటి సమంత అభిమానుల కోసం కుదిరిన ప్రతిసారీ సమయం కేటాయిస్తుంటారు. సోషల్ మీడియా వేదికగా చాటింగ్ చేస్తుంటారు. ఫ్యాన్స్ అడిగిన ప్రశ్నలకు ఆసక్తికర సమాధానాలు ఇస్తుం టారు. అప్పుడప్పుడు నెటిజన్లు ఆకతాయి ప్రశ్నలు వేస్తుంటారు. అలాంటి సమయంలో సహనాన్ని కోల్పోతే ధీటుగా సమాధానం ఇస్తారు సామ్. తాజాగా అలాంటి ఘటనే సామ్‌కు ఎదురైంది.. 'మళ్లీ పెళ్లిపై మీరెందుకు ఆలోచించకూడదు?' అని తాజాగా ఓ నెటిజన్ ప్రశ్నించగా ఆమె స్పందించారు. విడాకులకు సంబంధించిన లెక్కల్ని చూపిస్తూ.. ఈ లెక్కల ప్రకారం అది బ్యాడ్ ఇన్వెస్ట్‌మెంట్ అని పేర్కొని దానికి స్మైలీ ఎమోజీ జోడించారు. 'కీ డివోర్స్ స్టాటిస్టిక్స్' పేరుతో సమంత షేర్ చేసిన ఇమేజ్‌లో.. 2023లో.. మొదటి పెళ్లి విడాకులు 50 శాతం ఉండగా, రెండో, మూడోసారి పెళ్లిళ్ల విడాకులు 67 శాతం, 73 శాతంగా ఉంది. స్త్రీ, పురుషుల విషయంలోనూ ఈ రేటింగ్ ఇలానే ఉందట' అని పేర్కొన్నారు. మరో నెటిజన మీరు దేవుడిని నమ్ముతారా? అంటే నమ్ముతానని సమంత చెప్పారు. మనం గురించి మనకు బాగా తెలుసని అనుకుంటాం. అదే సమయంలో కొన్ని సర్‌ప్రైజ్‌లు జరుగుతుంటాయి. దీనిపై మీ అభిప్రాయం ఏంటని అడగగా.. అవును.. కొంత మంచి, కొంత చెడు ఉంటుంది. ఆరెండు ఉంటేనేగా మన జీవితం యునీక్‌గా ముందుకెళ్తుంది' అని చెప్పారు. రానున్న సంవత్సరం ఎలా ఉండాలని కోరుకుంటున్నారు అన్న ప్రశ్నకు మంచి ఆరోగ్యాన్ని ఇవ్వాలని కోరుకుంటున్నా' అని అన్నారు.







# రావు రమేష్.. మారుతీనగర్ సుబ్రహ్మణ్యం

తెలుగులో వైవిధ్యమైన నటులు ప్రస్తుతం ఎవరైనా వున్నారు అంటే అది ఒక్క రావు రమేష్ మాత్రమే అని చెప్పొచ్చు. కామెడీ, సీరియస్, భావోద్వేగాలు ఎటువంటివైనా తనకి తానే సాటి అనిపించుకున్న రావు రమేష్ గురించి తెలుగు ప్రేక్షకులకు పరిచయం అవసరం లేదు. తెలుగు చలనచిత్ర పరిశ్రమలో అత్యంత ప్రతిభావంతుడైన నటుడు. తండ్రికి తగ్గ తనయుడిగా, తనదైన శైలిలో డైలాగ్ లు చెపుతూ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నారు. అందుకనే రావు రమేష్ ఎంపిక చేసుకునే పాత్రలు చూస్తే అవన్నీ ఒకదానితో ఒకటి సంబంధం లేకుండా అన్నీ వెరైటీగా ఉంటాయి. ఇంకో ఆసక్తికర విషయం ఏంటంటే అతను నటించే సినిమా ఫలితం ఎలా వున్నా రావు రమేష్ పాత్రలు ఎప్పుడూ ఫెయిల్ అవలేదు, అవి ఎప్పుడూ హిట్ అవుతూ వచ్చాయి. అటువంటి నటుడు ఇప్పుడు ఓ సినిమాలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. టైటిల్ పాత్రలో 'మారుతి నగర్ సుబ్రమణ్యం అనే సినిమా చిత్రీకరణ పూర్తి చేసుకుందని తెలిసింది. ఇందులో అతను ప్రధాన పాత్రలో కనపడతారని, సినిమా నేపథ్యం అంతా అతని పాత్ర చుట్టూ తిరుగుతూ ఉంటుందని తెలిసింది. అతనికి జోడీగా ఇంద్రజ ఒక కీలక పాత్రలో నటిస్తోంది. 'హ్యాపీ వెడ్డింగ్' ఫేమ్ లక్షణ్ కార్య ఈ చిత్రానికి దర్శకుడు. సినిమా అంతా వినోదాత్మకంగా వుండే ఈ సినిమా మొత్తం చిత్రీకరణ పూర్తి అయిందని చిత్ర నిర్వా హకులు ఒక ప్రకటనలో చెప్పారు. 'రావు రమేష్ గారిని ఇప్పటి వరకు చాలా సినిమాలో వివిధ పాత్రలో చూసిన ప్రేక్షకులకి, ఈ సినిమాలో ఒక వినోదాత్మకమైన పాత్రలో ప్రేక్షకులు మెచ్చే విధంగా కనిపిస్తారు. అన్ని సినిమాల్లో అతని డైలాగులు ఎలా పాపులర్ అయ్యాయో, ఈ సినిమాలో కూడా అతని డైలాగ్స్ బాగా పాపులర్ అవుతాయని అనుకుంటున్నాను. ఇక చిత్రీకరణ పరంగా ఆయన మాకు ఎంతో సహాయం చేశారు. బిజీగా ఉన్నప్పటికీ, మా సినిమాకి ఎక్కువ డేట్స్ కేటాయించి సినిమా పూర్తి కావడానికి ఎంతో సపోర్ట్ చేశారు. ఈ సినిమాపై, అతను చేస్తున్న పాత్ర మీద ఆయనకు అంత నమ్మకం, ప్రేమ ఉన్నాయి.